


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


రీ-సర్వే ఆన్‌లైన్ రికార్డుల్లో అక్రమాలు




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 226 | పేజీలు - 08 | వెల - 05/- | బుధవారం 12-08-2026


## శాంతిభద్రతలపై సీఎం సమీక్ష..

# 1300 మంది పోలీసులతో కీలక భేటీ

- రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం
- గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ
- పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి,

మిగతా 2లో

## మాతాశిశు సంరక్షణే ధ్యేయం:

# కర్నూలు జిల్లాకు 27 'తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాల కేటాయింపు

- కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్
- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన మంత్రి భరత్, కలెక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత
- ఏసీ సదుపాయంతో పాటు ఆధునిక భద్రతా ప్రమాణాలతో నూతన వాహనాలు



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అత్యవసర వేళల్లో నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం '102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత బలోపేతం చేసిందని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ వెల్లడించారు. మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా కేటాయించిన 27 'తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిలతో కలిసి

మిగతా 8లో

## నకిలీ పోలీసులతో ర్యాలీలా?:

# వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు



- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు

మిగతాది 2లో



2

# ఎస్బీఐలో భారీ రిక్రూట్‌మెంట్.. 9 వేలకు పైగా పోస్టులు

- 9,124 జూనియర్ అసోసియేట్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 11 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- హైదరాబాద్ సర్కిల్‌లో 260 ఉద్యోగాల కేటాయింపు
- ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక
- డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు

ప్రభుత్వ రంగ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్బీఐ) నిరుద్యోగులకు శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా 9,124 జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) పోస్టుల భర్తీకి మంగళవారం భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు 11న ప్రారంభం కాగా,

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

- అమెరికా ఆర్థికమంత్రి వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్
- లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోందని మండిపాటు
- ఆంక్షల బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్య

2

# రష్యా చమురు

## పై ఆంక్షలు.. ఇంధన వనరుల కోసం భారత్ కొత్త దారులు



- ఇంధన భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని వెల్లడి

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ఇంధన సరఫరా గొలుసులో ఆటంకాలు ఎదురవుతున్న నేపథ్యంలో, భారత ఇంధన భద్రతను పటిష్ఠం చేసేందుకు ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించినట్లు విదేశాంగ శాఖ మంగళవారం వెల్లడించింది. దేశ ప్రయోజనాలు, జాతీయ ప్రాధాన్యతల మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ అంశంపై మాట్లాడుతూ, "140 కోట్ల మంది భారతీయుల అవసరాలను తీర్చడమే మా ఇంధన భద్రత ప్రధాన లక్ష్యం. దీనికోసం ఇంధన వనరుల సమీకరణను విభిన్న దేశాలకు విస్తరిస్తున్నాం. ఏ ఒక్క దేశంపైనే

మిగతాది 2లో



2

గెలుపు తర్వాత నియోజకవర్గ యువతకు ప్రశాంత్

# కిశోర్ తొలి హామీ ఇదే..

- రెండేళ్లలో 10 వేల మంది యువతకు ఉద్యోగాల హామీ
- ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నం
- యువత సీవీలు సమర్పించాలని ప్రశాంత్ కిశోర్ సూచన

రేషన్ కార్డు సమస్యలు మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ రేషన్ ధాన్యం 4 నుంచి 5 కిలోలకు పెంచుతామని ప్రకటన బాంకీపూర్ ఉప ఎన్నికలో విజయం సాధించిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ యువతకు కీలక హామీ ఇచ్చారు. వచ్చే రెండేళ్లలో నియోజకవర్గానికి చెందిన కనీసం 10 వేల మంది యువతకు ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు.

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం

# భారతరత్న మాత్రమే



- భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్
- భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య
- పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న

భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు.కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు.

మిగతాది 2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'..

# బిల్లుకు లోక్‌సభ ఆమోదం



2

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం

# రష్యా చమురుపై ఆంక్షలు..

## ఇంధన వనరుల కోసం భారత్ కొత్త దారులు

మాట్లాడుతూ, "140 కోట్ల మంది భారతీయుల అవసరాలను తీర్చడమే మా ఇంధన భద్రత ప్రధాన లక్ష్యం. దీనికోసం ఇంధన వనరుల సమీకరణను విభిన్న దేశాలకు విస్తరిస్తున్నాం. ఏ ఒక్క దేశంపైనే ఆధారపడకుండా విభిన్న మార్గాల ద్వారా ఇంధనాన్ని సేకరించాలన్నదే మా వ్యూహం" అని వివరించారు.రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారాలు కల్పిస్తూ ఆ దేశ సెనేట్ చట్టాన్ని ఆమోదించిన తరుణంలో రణధీర్ జైస్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ సుంకాల అంశంపై అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.



ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి భౌగోళిక రాజకీయ సవాళ్ల నేపథ్యంలో భారత్ తన వ్యూహాన్ని మార్చుకుంది. గతంలో చమురు దిగుమతుల కోసం 27 దేశాలపై ఆధారపడగా, ప్రస్తుతం ఆ సంఖ్యను 41కి పెంచుకుంది. ముఖ్యంగా రష్యా నుంచి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. జులై నెలలో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా వాటా రష్యాదే కావడం గమనార్హం. అదేవిధంగా, ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) దిగుమతులను కూడా 6 దేశాల నుంచి 15 దేశాలకు విస్తరించింది. ప్రస్తుతం అమెరికా నుంచి భారీగా ఎల్ఎన్‌జీ భారత్‌కు చేరుతోంది. దేశ ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నందున, సరఫరాలో ఆటంకాలు కలగకుండా వనరులను వైవిధ్యీకరించడం అత్యవసరమని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సోమవారం పార్లమెంటుకు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

---

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలపై, ముఖ్యంగా తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంక్షల ద్వారా ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అంటూ అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. దౌత్య మార్గాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా అమెరికా ఈ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగిస్తోందని, అవి పనిచేయనప్పుడు మరింత తీవ్రతను పెంచుతూ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దశాబ్దాలుగా ఇరాన్ ప్రజలు అమెరికా విధించిన కఠినమైన ఆంక్షలను తట్టుకుని నిలబడ్డారని, కేవలం ఆంక్షల బెదిరింపులతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం ఎవరికీ సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. అమెరికా నాయకులు ఈ విపరీత ధోరణిని, చెడు అలవాటును ఇలాగే కొనసాగిస్తే, భవిష్యత్తులో దౌత్యపరమైన సంక్షోభాల నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే స్వయంగా నాశనం చేసుకుంటారని హెచ్చరించారు.
మరోవైపు, ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను అధిగమించడానికి డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. ఇరాన్ కొనసాగిస్తున్న అక్రమ ఆర్థిక వ్యవస్థలను గుర్తించి త్వరలోనే పూర్తిగా ధ్వంసం చేస్తామని వెల్లడించారు.ఇంకోవైపు, అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ ఇరాన్ సైనిక నాయకత్వంలో కీలక నియామకాలు జరిగాయి. దేశ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ తొలిసారిగా మిలిటరీ విభాగంలో ప్రధాన మార్పులు చేశారు. సాయుధ దళాల చీఫ్‌గా మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని, డిప్యూటీ చీఫ్‌గా కియుమర్స్ హైదరీని నియమించారు. అలాగే శక్తివంతమైన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీని, ఆయన డిప్యూటీగా మొస్తఫా ఇజాదీని బాధ్యతల్లోకి తీసుకువచ్చారు. మొజ్తబా ఖమేనీ నాయకత్వంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి నియామకాలు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష..
## 1300 మంది పోలీసులతో కీలక భేటీ



బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా?: వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను



తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## 15న సంగారెడ్డిలో లక్ష మందితో భారీ బహిరంగ సభ

**జనసమీకరణ, భద్రత, వేదిక ఏర్పాట్లపై ఫోకస్**

**3.43 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు**

**ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష**



హైదరాబాద్ పంద్రాగస్టు రోజు సంగారెడ్డి పట్టణంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనసమీకరణ, భద్రత, వేదిక తదితరాంశాలపై ఫోకస్ పెట్టింది. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగారెడ్డి బహిరంగ సభను జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. అదే రోజు ఏకకాలంలో అన్ని జిల్లాల్లో కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మొత్తం పది మంది లబ్దిదారులకు సీఎం స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్దిదారులు ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెలా ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని తెలిపారు. సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఇందుకోసం సరఫరా చేస్తోందని చెప్పారు. స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## గెలుపు తర్వాత నియోజకవర్గ
## యువతకు ప్రశాంత్ కిశోర్ తొలి హామీ ఇదే..

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం విద్యార్హతలు ఉన్న యువత బయోడేటాలు, సీవీలను తన కార్యాలయంలో అందజేయాలని కోరారు. బాంకీపూర్‌లో మంగళవారం నిర్వహించిన పలు కృతజ్ఞత సభల్లో ప్రశాంత్ కిశోర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తాను హామీ ఇవ్వడం లేదని చెప్పారు. అయితే తన పరిచయాలు, నెట్‌వర్క్‌ను ఉపయోగించి దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించేలా చూస్తానని తెలిపారు. బిహార్‌లో జనసురాజ్ వ్యవస్థ బలపడిన తర్వాత ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని ప్రశాంత్ కిశోర్ అన్నారు. నియోజకవర్గంలో పిల్లల విద్యకు పునాది వేసే చర్యలు చేపడతానని చెప్పారు. నిలిచిపోయిన వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు కోసం లంచం అడిగే పరిస్థితి లేకుండా చేస్తానని చెప్పారు. ఇందుకు మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. రేషన్ కార్డు ఉన్నవారికి ప్రస్తుతం అందుతున్న నాలుగు కిలోల ధాన్యాన్ని ఐదు కిలోలకు పెంచుతామని తెలిపారు. వృద్ధుల పింఛన్ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితాలతో బిహార్ రాజకీయాల్లో మార్పు కనిపిస్తోందని ప్రశాంత్ కిశోర్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్ల' గురించి కాకుండా విద్య, ఉపాధి గురించి చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఇది ప్రజల ఓటుకున్న శక్తి అని పేర్కొన్నారు.ం

## 'కేరళ' ఇకపై 'కేరళం'..
## బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

## ఎస్బీఐలో భారీ రిక్రూట్‌మెంట్..

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 11న ప్రారంభం కాగా, అభ్యర్థులు ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా 2026 డిసెంబర్ 31 నాటికి ఉత్తీర్ణత పత్రం సమర్పించే షరతుతో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 2026 ఏప్రిల్ 1 నాటికి అభ్యర్థుల వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్డ్ కేటగిరీల వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా హైదరాబాద్ సర్కిల్ (తెలంగాణ) పరిధిలో 260 పోస్టులను కేటాయించారు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు దరఖాస్తు రుసుము రూ.750 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని అనంతపురం, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, చీరాల, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అభ్యర్థులను మూడు దశల్లో ఎంపిక చేస్తారు. తొలుత ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష (సెప్టెంబర్ 26, 27, అక్టోబర్ 3 తేదీల్లో), అనంతరం మెయిన్స్ పరీక్ష (నవంబర్‌లో) నిర్వహిస్తారు. తుది దశలో స్థానిక భాషా ప్రావీణ్యతను పరీక్షిస్తారు. అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రంలోని ఖాళీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఆ రాష్ట్ర స్థానిక భాషలో నైపుణ్యం కలిగి ఉండటం తప్పనిసరి అని ఎస్బీఐ స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా సూచించింది.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..
## భారీ పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.



సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## పబ్లిక్ నోటీస్.

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా Veeram Prasadreddy S/o Veeram Shivaram Reddy, H-NO-3-6, 10 Bollavaram village, Nandikotkur (Mandal), Nandyal (dist.) 04-08-2026 నేను జిరాక్స్ కాపీల కోసం బొల్లవరం నుండి బ్రహ్మణకొట్కూర్ వెళ్తుండగా అసలు రిజిస్ట్రేషన్ పత్రాలు ప్రమాదవశాత్తు పోగొట్టుకున్నాను నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ SRO జారీ చేసిన రిజిస్ట్రేషన్ నంబర్ 123/1970 గల రిజిస్ట్రేషన్ పత్రాలు ఎవరికైనా దొరికిన యడల ఈ కింది అడ్రస్ కు మరియు మొబైల్ నెం :9000007242 అంద చేయగలరు మరియు దీనిపై జరుగు క్రయవిక్రయాలు చెల్లనిరవని తెలియజేయడమైనది.

# వసతి గదుల నిర్మాణానికి ఇరువురి విరాళం

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా





నిర్మిస్తున్న వసతి గదుల నిర్మాణానికి ఇరువురు విరాళం అందజేసినట్లు ఈవో ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ కు చెందిన బి.సుబ్రహ్మణ్యం, సంధ్యారాణి దంపతులు రూ. ఒక సూట్ నిర్మాణానికి రూ. 15 లక్షల చెక్కును అందజేశారన్నారు. అలాగే మరో దాత సన్నిధి సురేష్ బాబు, లతాశ్రీ దంపతులు వసతి గది నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు.ముందస్తుగా మొదటి విడతలో రూ. 2.5 లక్షలు అందజేశారన్నారు. దాతలను ఈవో శేష వస్త్రాలతో సత్కరించగా, అర్చకులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, ఉప ప్రధాన అర్చకులు శివ శంకరయ్య శర్మ, ముఖ్య అర్చకులు మాణిక్య శర్మ, అర్చకులు మణికంఠ శర్మ లు పాల్గొన్నారు

# రీ-సర్వే ఆన్‌లైన్ రికార్డుల్లో అక్రమాలు

**- 75 సెంట్ల భూమి గల్లంతుపై జాయింట్ కలెక్టర్‌కు, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ (జిల్లా సర్వేయర్)కు ఫిర్యాదు**
**-బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మూలగాజ రమేష్ రెడ్డి డిమాండ్**



జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

కర్నూలు /వెల్దుర్తి ఆగస్టు 10 ( పల్లె వెలుగు ) : శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష (రీ-సర్వే) ప్రక్రియలో భాగంగా అధికారులు చేసిన తీవ్రమైన నిర్లక్ష్యం వల్ల తాను రికార్డుల పరంగా 75 సెంట్ల భూమిని నష్టపోయానని, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు మూలగాజ రమేష్ రెడ్డి కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ని, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ (జిల్లా సర్వేయర్) ను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు.

ఘటన వివరాలు..

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం, బుక్కాపురం గ్రామంలోని సర్వే నంబర్ 194 లో రైతు మూలగాజ రమేష్ రెడ్డి (తండ్రి సుబ్బారెడ్డి) కు పాత రికార్డుల ప్రకారం 2.79 ఎకరాల భూమి ఉంది. రీ-సర్వే ప్రారంభానికి ముందు రెవెన్యూ శాఖ ఇచ్చిన నోటీసులో కూడా ఇదే విస్తీర్ణం పేర్కొన్నారు. అనంతరం రీ-సర్వే బృందం క్షేత్రస్థాయిలో కొలతలు జరిపి ఇచ్చిన సర్వే రిపోర్టులో భూమి విస్తీర్ణం 2.80 ఎకరాలు ఉన్నట్లు ధ్రువీకరించారు.

ఆన్‌లైన్ ఎంట్రీలో తీవ్ర హెచ్చుతగ్గులు..

క్షేత్రస్థాయిలో 2.80 ఎకరాల భూమి స్పష్టంగా ఉన్నప్పటికీ, వివరాలను ఆన్‌లైన్ రికార్డుల్లో (వెబ్‌ల్యాండ్/అడంగల్) నమోదు చేసే సమయంలో విలేజ్ సర్వేయర్ శోభా రాణి, వీఆర్వో యల్లక్రిష్ణ, మరియు రీ-సర్వే డీటీ రామలక్ష్మి లు తీవ్రమైన అలసత్వంతో వ్యవహరించారని బాధితుడు ఆరోపించారు. ఆన్‌లైన్‌లో నా భూమిని కేవలం 2.04 ఎకరాలుగా మాత్రమే నమోదు చేశారని, దీనివల్ల రికార్డుల పరంగా 0.75 ఎకరాల (75 సెంట్లు) భూమి గల్లంతైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**శాఖాపరమైన చర్యలు తీసుకోండి..**

క్షేత్రస్థాయి రిపోర్టులను పక్కనబెట్టి ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో అక్రమాలకు పాల్పడిన విలేజ్ సర్వేయర్ శోభా రాణి, వీఆర్వో యల్లక్రిష్ణ, రీ-సర్వే డీటీ రామలక్ష్మి లపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రమేష్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే పాత రికార్డులు, రీ-సర్వే రిపోర్టు ఆధారంగా ఆన్‌లైన్ రికార్డుల్లో తన భూమి విస్తీర్ణాన్ని 2.80 ఎకరాలుగా సరిచేసి, సవరించిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని మంజూరు చేసి న్యాయం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ (జిల్లా సర్వేయర్)ను వేడుకున్నారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లినరీ సమావేశం కరపత్రాల ఆవిష్కరణ..



పాణ్యం ఆగస్ట్ 11 పల్లె వెలుగు : మండల కేంద్రంలోని షాది ఖానా లో ఈనెల 20న నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మార్ నాయక్ పిలుపునిచ్చారు.షాది ఖానా లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశ కరపత్రాలను హైస్కూల్ ప్రాంగణం పరిధిలో కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20న నిర్వహించనున్న జిల్లా ప్లినరీ సమావేశంలో విద్యారంగ సమస్యల పరిష్కారంపై చర్చించి పోరాటాలకు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజా,పాణ్యం నాయకులు మెసేక్, మనోహర్, ప్రవీణ్, తిరుమలేష్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో

## రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ సి ఆర్ పి అవగాహన కార్యక్రమం.

పల్లె వెలుగు బనగానపల్లె.. బనగానపల్లె రెడ్‌క్రాస్







సొసైటీ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్‌లో ఫస్ట్ ఎయిడ్, సి ఆర్ పి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ బనగానపల్లె సబ్ బ్రాంచ్ చైర్మన్ మరియు ఏపీ మోడల్ స్కూల్ ఎస్ ఎం సి చైర్మన్ సైపుల్లా అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఏ.అరుణకుమారి నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ ప్రముఖ గైనకాలజిస్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సి ఆర్ పి ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, ప్రాణాలను కాపాడటంలో ఫస్ట్ ఎయిడ్, సి ఆర్ పి పాత్ర గురించి వివరించారు.

కార్యక్రమంలో బనగానపల్లె సబ్ బ్రాంచ్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ హనుమంతు , రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ మరియు ఏపీ మోడల్ స్కూల్ ఎస్ ఎం సి వైస్ చైర్మన్ పరమేశ్వరుడు , రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సత్యనారాయణ , ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మరియు స్కూల్ ఎస్ ఎం సి కమిటీ సభ్యులు దాదా ఖాజా పీర్ , సీనియర్ టీచర్ జి.శేఖర్ , పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సిహెచ్ రామలక్ష్మి , ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి ఆర్ పి చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా ప్రదర్శించి 9, 10 ఏ ఇంటర్మీడియేట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో సి ర్ పి అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ బనగానపల్లె సబ్ బ్రాంచ్ చైర్మన్ సైపుల్లా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సి ఆర్ పి పై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రజల్లో ప్రాణ రక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# బసాపురంలో కేబుల్ వైర్ల చోరీ





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం బసాపురం గ్రామంలోని తాగునీటి ట్యాంకులు, వ్యవసాయ బోర్ల నుంచి కేబుల్ వైర్లు చోరీకి గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఉదయం నీళ్లు పట్టేందుకు వెళ్లిన గ్రామస్థులు, పొలాలకు వెళ్లిన రైతులు గమనించారు. రాత్రి వేళల్లో గుర్తు తెలియని దుండగులు కత్తిరించుకొని పోయారని తెలిపారు. దీంతో పంట పొలాలకు నీరు అందించేందుకు,తాగునీరుకి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఐసీడీఎస్ సూపర్వైజర్ మృతి



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఐసీడీఎస్ సూపర్వైజర్ తోట కవిత (45) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల వద్ద సమావేశం నిర్వహించేందుకు వెళ్లగా అక్కడున్న వారితో మాట్లాడుతూ ఉండగానే కింద పడిపోయారు. దీంతో అక్కడే ఉన్న తోటి ఉద్యోగులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఇండస్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మృతదేహాన్ని నంద్యాల ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి, ఆత్మకూరు సిడిపిఓ కోటేశ్వరమ్మతో పాటు నంద్యాల, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ, మహానంది సూపర్వైజర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, పలువురు సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

# మృతులకు చోటేది....?

- మృతుల సమాధులకూ భద్రత కరువు..
- పాత సమాధులు తవ్వి కొత్త ఖననాలు!
- గజ్జహల్లి హిందూ స్మశాన వాటికలో దారుణ పరిస్థితి
- శవాలను పూడ్చేందుకు స్థలం లేక పాత సమాధులు తవ్వాల్సిన దుస్థితి







హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 11 హిందువుల దహన, అంత్యక్రియల కోసం వినియోగిస్తున్న గజ్జహల్లి గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో స్థలం కొరత తీవ్ర సమస్యగా మారింది. ప్రస్తుతం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియల అనంతరం మృతదేహాన్ని పూడ్చేందుకు సరైన స్థలం లేకపోవడంతో గతంలో పూడ్చిన మృతదేహాల సమాధులను తిరిగి తవ్వి, అక్కడే కొత్త మృతదేహాన్ని పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా స్మశాన వాటికకు సరిపడా స్థలం లేకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఒక కుటుంబ సభ్యుడిని పూడ్చిన స్థలాన్ని కొంతకాలం తర్వాత మరో మృతదేహం కోసం తిరిగి తవ్వాల్సి రావడం తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

మృతులకు కనీస గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలి గ్రామంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత స్మశాన వాటిక స్థలం ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అదనంగా స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుల అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇప్పటికే గ్రామ సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అదనపు స్థలం కేటాయించి, గజ్జహల్లి హిందూ స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లా వ్యాప్తంగా “శక్తి యాప్ ప్రయోజనాలు,మహిళల భద్రత,

## సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు..








పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో గల స్కూలు, కళాశాలలో, విద్యాసంస్థలలో మహిళల భద్రత శక్తి యాప్ ప్రయోజనాలు కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సంబంధిత అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో శక్తి యాప్ ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్ ప్రయోజనాలను విద్యార్థినీ, విద్యార్థులకు మహిళలు, అత్యవసర సమయాల్లో దాని ద్వారా పొందగలిగే రక్షణ, సహాయ సేవల గురించి వివరించారు. అలాగే శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలియజేశారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధం, బాలలపై నేరాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 112 లేదా 1098కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 100/112 సైబర్ నేరాల విషయంలో 1930 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అదేవిధంగా ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పంపినప్పుడు వాటిని ఓపెన్ చేయవద్దని, వాటి ద్వారా సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందని మరియు బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత సమాచారం కోల్పోయి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు అందించే సహాయ సేవల గురించి కూడా వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు.

ఈవ్‌టీజింగ్ లేదా ఇతర వేధింపులకు ఎవరైనా పాల్పడితే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, శక్తి యాప్, 112 తదితర సేవలను ఉపయోగించుకోవాలని భరోసా కల్పించారు. 18 సంవత్సరాల లోపు మైనర్ విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపరాదని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలో పాటించాలని,ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు మరియు విద్యార్థుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలియజేశారు.

# కాపర్ వైర్ దొంగల బీభత్సం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 11: కాపర్ వైర్ దొంగలు విజృంభిస్తున్నారు. యదేచ్చగా దొంగలు తమ చేతికి పని చెబుతున్నారు. కర్నూలు కడప కాల్వ వెంట రైతులు



వేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్లను అత్యంత సులువుగా దోచుకొని వెళ్తున్నారు. ఖరీఫ్ సీజన్లో తమ పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతూ ఉండగా, రైతులను ఆర్థికంగా మరింత దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి బండి ఆత్మకూరుకు సంబంధించిన 50 మంది రైతులకు సంబంధించిన విద్యుత్తు వైర్లను ఎత్తుకొని వెళ్లడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట తమ పొలాలకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురి కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు అవుటాల నాగేశ్వరరెడ్డి, గంగాధర్ రెడ్డి, అల్లా బకష్, వెంకటేశ్వర్లు రామచంద్ర, చాంద్ తదితర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కాపర్ వైర్ విలువ 15 వందల రూపాయల వరకు ఉంటుందని, కాపర్ దొంగలు దోపిడీకి పాల్పడుతూ ఉండటంతో, తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు విచారణ వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసులు రాత్రి వేళ గస్తీ తిరుగుతూ ఉండేవారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు నేడు లేకపోవడంతో కాపర్ దొంగలు చెలరేగిపోతున్నారని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత రెండు మూడు నెలల కాలం నుండి ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయని రైతులు విచారణ వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి కాపర్ దొంగల ఆట కట్టించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

# ఏకోడూరులో టిడిపి ఇంటింటా ప్రచారం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 11: పేద ప్రజలు, బడుగు వర్గాల సంక్షేమం ప్రభుత్వం పాలనలోనే జరుగుతూ ఉందని బండి ఆత్మకూరు మండల పరిధిలోని ఏ కోడూరు క్లస్టర్ ఇంచార్జి నల్ల నాగేశ్వర్ రెడ్డి, తెలుగుదేశం యువ నాయకుడు వడ్డు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏ కోడూరు గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండు సంవత్సరాల లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను గురించి ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. అభివృద్ధి సంక్షేమం, పేదలకు సహాయం, సూపర్ సిక్స్, తల్లికి వందనం, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ, శ్రీ శక్తి, ఉచిత సిలిండర్లు ఓటమి ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు అందివ్వడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పెంపు చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలు ప్రమాదాలకు గురై ఆర్థిక ఇబ్బందులు గురైన నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఎంతో మంది పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోవడం జరిగిందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి రాబోవు రోజులలో మరోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా మద్దతు తెలిపి ప్రజలు ఆశీర్వదించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ సుబ్రహ్మణ్యం, చంద్ర, గోపి తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

----------------------------------

# కూటమి ప్రభుత్వ లక్ష్యం.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే: చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**ఎన్టీఆర్ నగర్‌లో ‘2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం’ ఇంటింటి ప్రచారం**

**ప్రభుత్వ పథకాలు, విజయాలపై కరపత్రాల పంపిణీ**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సంక్షేమం, నగర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ స్పష్టం చేశారు. మంగళవారం కల్లూరు మండల పరిధిలోని 41వ వార్డు ఎన్టీఆర్ నగర్, ఆంజనేయస్వామి ఆలయం వీధిలో “2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం” కార్యక్రమంలో భాగంగా ఆమె విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్చార్జ్ సుతారు రాఘవేంద్ర, 41వ వార్డు ఇన్చార్జ్ నాగేశ్వరరావు, క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, సీనియర్ నాయకులు ఇమ్మానియేల్, యూనిట్ ఇన్చార్జ్ ఖాదర్ వలి, బూత్ ఇన్చార్జ్ లు బాలకృష్ణ, సుబ్బరాయుడు, వెంకటేష్, అనిల్, బి.రాఘవేంద్ర, అలాగే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ నగర్ సోమన్న, కృష్ణ, సంజీవ, సుంకాచారి, జమ్మన్న, చిన్న మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, స్కూల్స్, కాలేజీలపై చర్యలు తీసుకోవాలి.

**డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కమిటీ.**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు పాటించకుండా కొన్ని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు నిర్వహిస్తున్నారని, సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నంద్యాల పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం, సరైన మౌలిక వసతులు లేకుండా తరగతులు నిర్వహించడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరింది. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు, ఫైర్ సేఫ్టీ, భవన భద్రత తదితర అవసరమైన నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అనే విషయాన్ని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించాలి. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్యా సంస్థల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నంద్యాల పట్టణంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, స్కూల్స్, కాలేజీలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని సంస్థలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది.

అలాగే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి, విద్యా సంస్థల్లో నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరింది.లి

లిప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి సాయి ఉపాధ్యక్షులు మా భాష నరేంద్ర ఇర్ఫాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

----------------------------------

# భూటాన్ అంతర్జాతీయ ‘గోల్ఫ్ షాట్ బాల్’ పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా విద్యార్థులు.

?పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.భూటాన్ దేశంలో ఆగస్టు 23 నుండి 27 వ తేదీ





వరకు జరగనున్న అంతర్జాతీయ ‘గోల్ఫ్ షాట్ బాల్’ గేమ్స్ పోటీలకు నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వారు భూటాన్ వెళ్లనున్నారు. ?ఎంపికైన విద్యార్థుల వివరాలు: 1. ?కుమారి జగదీశ్వరి: 9వ తరగతి, ఎం.జి.పి.ఎ.పి బి.సి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్), నంద్యాల. 2. ?మిస్టర్ ఎన్. తేజా నాయక్: 10వ తరగతి, కాకతీయ హైస్కూల్, కలవబుగ్గ. ?ఆర్థిక సహాయం ఉ ప్రోత్సాహం:ఈ అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులు మరియు ఇతర చార్జీల నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ. 50,000 (యాభై వేల రూపాయల చొప్పున) ఆర్థిక సహాయం (ఫైనాన్షియల్ సపోర్ట్) అందించడం జరుగుతోంది. ?అంతర్జాతీయ స్థాయిలో మన జిల్లా మరియు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాణించాలని కోరుతూ ఈ విద్యార్థులకు జిల్లా అధికారుల మరియు పాఠశాల ఉపాధ్యాయుల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రైతు సాగు చేసిన ఖరీఫ్ పొలంలో పంట కోత ప్రయోగం




దొర్నిపాడు ఆగస్టు 11 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ సాగుచేసిన పిఎండిఎస్ పొలంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారిని ప్రమీల ఆధ్వర్యంలో పంటకోతప్రయోగం నిర్వహించారుఇందులోభాగంగా25 చదరపు మీటర్ల లో 24.19 ఎస్త్రం ఆకుకూరదిగుబడి వచ్చిందన్నారు,దీని ద్వారా ఎకరానికి దాదాపుగనాలుగు ఈ విధంగాఖరీఫ్ సాగు చేయుట వలన ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు అలాగే నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని తెలిపారు. కాబట్టి రైతులు అందరూ ప్రధాన పంటకు ముందు ఖరీఫ్ సాగు వలన నేల సారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. అలాగే పంటల భీమా చేయించుకోవడానికి ఈ నెల 15 తేదీన చివరి తేదీ కావున రైతులు అందరూ పంట బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖసిబ్బంది సుబ్బారాయుడు, శివ, శంకర్, కావేరి, సుబ్బయ్య,సుమతి అంజి మరియు రైతులు పాల్గొన్నారు

# అగ్నికి ఆహుతైన పశుగ్రాసం

## రైతుకు4లక్షలు నష్టం



దొర్నిపాడు ఆగస్టు 11 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మంగళవారంగడ్డివాములు జొన్నచొప్పవాములుప్రమాదవశాత్తు అగ్నికిఆహుతైదగ్ధం అయ్యాయి.గ్రామానికి చెందిన మద్దుబైగారి హుసేన్బాషా కు చెందిన మూడు గడ్డివాములు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. రైతుకు సుమారు నాలుగు లక్షల నష్టం వాటిలిందని బాధితరైతు ఆవేదనవ్యక్తంచేశారు,బాధితులు,ప్రజలువెంటనేస్పందించిఆళ్లగడ్డఅగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో స్పందించివచ్చి మంటలను అదుపు చేసిప్పటికి ఫలితం లేకుండా పోయింది.విషయం తెలుసుకున్నపశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు కాలిపోయిన గడ్డివాములను పరిశీలించారు. కాడెద్దులు, గేదెలకు నోటికాడి మేత లేకుండా పోయిందని ప్రభుత్వం. స్పందించి ఆర్థిక సాయంతో పాటు పశుగ్రాసం అందించాలని బాధితుడు అధికారులను కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడు నాయక్ ఎల్ఎఫ్, మనోహర్ రెడ్డి సిబ్బంది రమణయ్య,గుర్రపుపాల్గొన్నారు. ×

## బాధిత కుటుంబానికి ఎంపీటీసీ కలువకూరి రమణ భరోసా

పోరుమామిళ్ల, ఆగస్టు 11: ( పల్లె వెలుగు)వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని రంగసముద్రం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా



గాయపడి లేవలేని స్థితిలో ఉన్న మున్నా కుటుంబాన్ని ఎంపీటీసీ కలువకూరి రమణ పరామర్శించారు. మున్నా ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న రమణ.. వారికి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. మున్నా త్వరగా కోలుకుని గతంలో మాదిరిగా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కలువకూరి రమణ ఆకాంక్షించారు. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకునేలా పోరాడి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రమాదం అనంతరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు న్యాయం కోసం అండగా నిలిచిన ఎంపీటీసీ కలువకూరి రమణకు కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# సర్వేంద్రియానాం నయనం ప్రధానం

**☛నేత్ర వైద్య అధికారి పి.శ్రీకృష్ణ దేవరాయలు**

**☛బాలాయ పల్లెలో "స్కూల్ ఐ స్క్రీనింగ్" కార్యక్రమం**



కాశినాయన, ఆగస్టు 11 ( పల్లె వెలుగు) :కాశినాయన మండలం లోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, బాలాయపల్లె నందు మంగళవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర వైద్య అధికారి పి.కృష్ణదేవరాయలు, ఏ.ఎన్.ఎమ్ లలితకుమారి, ఆశా కార్యకర్త కె.మేరీ హేమలత లు విద్యార్థులందరికీ కళ్ళను పరిశీలించి, కళ్ళ ఆరోగ్యం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు,కంటి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన పోషక విలువలు కలిగిన ఆహారం గురించి తెలియజేయడం జరిగింది. పిల్లలు సెల్ ఫోన్, టి.వి లకు దూరంగా ఉండాలన్నారు. కళ్ళ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఎప్పటి కప్పుడూ కళ్ళను కాపాడు కుంటూ తమ ఆరోగ్య కరమైన జీవితానికి బాటలు వేసుకోవాలని ఆయన కోరారు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి మాట్లాడుతూ... వ్యాధి లేని శరీరమే మనిషికి తరగని ఆస్తి అని, దేహం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. పండ్లు, ఆకు కూరలు బాగా వాడాలాన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా బాల నాగమ్మ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ నాయకుడు మస్తాన్ ఖాన్ మాతృమూర్తికి మాజీ మంత్రి బుగ్గన నివాళులు

పల్లె వెలుగు –?ప్యాపిలి ప్యాపిలి పట్టణానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు మస్తాన్ ఖాన్



మాతృమూర్తి సోమవారం కన్నుమూయగా, మంగళవారం వారి పార్థివ దేహానికి మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి బుగ్గన మృతురాలికి నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం మస్తాన్ ఖాన్,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తల్లిని కోల్పోవడం ఏ బిడ్డకైనా పూడ్చలేని లోటని, ఈ కష్ట సమయంలో పార్టీ పరంగా, వ్యక్తిగతంగా మస్తాన్ ఖాన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజేంద్ర నాథ్ రెడ్డి, ఎర్రగుంట్లపల్లె వెంకటేశ్వర రెడ్డి,కృష్ణారెడ్డి,భువనేశ్వర్ రెడ్డి, రాజా మురళి, కొలిమి బషీర్, ప్రభాకర్ రెడ్డి,వి శ్రీనివాసరెడ్డి,నిజాముద్దీన్, జింకల అంజి, చిన్న రామంజి, పూజారి శీను,పాండు, జాకీర్,ఇమాముద్దీన్, రమణ,రామ్మూర్తి పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి..

**చాకరాజువేములలో "పల్లెబాటలో -- ఈగల్" అవగాహన కార్యక్రమం.**

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి -- నంద్యాల జిల్లా పోలీసులు.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆళ్లగడ్డ ఎస్ డి పి ఓ పర్యవేక్షణలో దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామంలో నంద్యాల ఈగల్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నంద్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "పల్లెబాటలో -- ఈగల్" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు కుటుంబ సంబంధాలు దెబ్బతినడం, ఆర్థిక సమస్యలు ఏర్పడటం, చదువు మరియు ఉద్యోగ భవిష్యత్తు నాశనం కావడం వంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని వివరించారు.మత్తు పదార్థాల ప్రభావంతో నేరాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, తద్వారా నేరచరిత్ర ఏర్పడి భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన నేరాలపై అమలులో ఉన్న ఎన్ డి పి ఎస్ చట్టం గురించి ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాలను కలిగి ఉండటం, విక్రయించడం, రవాణా చేయడం, అక్రమంగా సరఫరా చేయడం వంటి నేరాలకు చట్ట ప్రకారం కఠినమైన శిక్షలు, జరిమానాలు విధించబడతాయని తెలిపారు.మత్తు పదార్థాల కేసుల్లో చిక్కుకుంటే వ్యక్తి జీవితంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా కుటుంబం మొత్తం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు.

ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు బానిసై ఉంటే వారిని డి అడిక్షన్ సెంటర్లో చేర్పించి తగిన చికిత్స అందించవచ్చని పోలీసులు తెలిపారు. వ్యసనానికి గురైన వారిని నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు వారికి అండగా నిలిచి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి సహకరించాలని సూచించారు.

గ్రామంలో లేదా పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి యువకుడు, ప్రతి గ్రామ ప్రజలు బాధ్యతగా వ్యవహరించినప్పుడే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించగలమని పోలీసులు తెలిపారు.

యువత తమ విలువైన భవిష్యత్తును మత్తు పదార్థాల కారణంగా నాశనం చేసుకోకుండా విద్య, ఉద్యోగం, క్రీడలు మరియు మంచి మార్గాల వైపు దృష్టి సారించాలని సూచించారు. "మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశంతో ప్రజలకు అవగాహన కల్పించారు.

డ్రగ్స్ రహిత నంద్యాల జిల్లా నిర్మాణానికి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు.

# కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది?

**ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం.. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం?**




కీసర, ఆగస్టు 11: పల్లె వెలుగు దినపత్రిక. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆదాయ, కుల, పుట్టిన తేదీ తదితర ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సేవలు సకాలంలో అందాల్సిన సమయంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం వంటి ధ్రువపత్రాలు విద్యార్థుల ఉన్నత విద్య, స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అవసరాలకు కీలకంగా మారుతున్నాయి. కళాశాలలు నిర్ణయించిన గడువులోపు (ద,ˇ ం వ ప ( తా ల ం న వ ం ర్పిం చ లే క పో తే విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయి?

దరఖాస్తుల పరిశీలనలో జాప్యమా? సిబ్బంది కొరత కారణమా? లేక అధికారుల పర్యవేక్షణ లోపమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న తర్వాత తమ ధ్రువపత్రాల పరిస్థితి ఏమిటో తెలుసుకునేందుకు కార్యాలయానికి పలుమార్లు రావాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు.

ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉంది. అలాంటప్పుడు విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ధ్రువపత్రాల విషయంలో జాప్యం చోటుచేసుకుంటే బాధ్యత ఎవరిది? కీసర తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఎన్ని? వాటిని పరిష్కరించడంలో ఎందుకు జాప్యం జరుగుతోంది? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అధికారుల వివరణ ఏమిటి?

ఈ ఆరోపణలపై కీసర తహసీల్దార్ కార్యాలయ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ధ్రువపత్రాల జారీకి నిర్దేశిత ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కారానికి తీసుకుంటున్న సమయం వంటి వివరాలను అధికారులు బహిర్గతం చేస్తే పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ధ్రువపత్రాల విషయంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# హెచ్ఐవి సోకకుండా జాగ్రత్త పడండి సురక్షితంగా జీవించండి.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆరోగ్య కరదీపికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.**
**హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలల్లో విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆరోగ్య కరదీపికను డీఎంహెచ్ఓ డా.వెంకటరమణ, డిస్టిక్ లెప్రసి హెచ్ఐవి టీబి కంట్రోల్ అధికారి డా.శారదా బాయి తో కలిసి ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, సకాలంలో చికిత్స పొందేలా ప్రజలను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా అధికారులను ఆదేశించారు.అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలల పాటు జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, ప్రారంభ దశలో చికిత్స, లైంగిక సంబంధ వ్యాధుల నివారణ తదితర అంశాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలన్నారు.

గర్భిణీలకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలను ప్రోత్సహించి, తల్లి నుంచి బిడ్డకు సంక్రమణను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు.1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవసరమైన వారు అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.రెండు నెలల పాటు వారానికి ఒక ప్రత్యేక అంశాన్ని తీసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సరైన అవగాహనతో అపోహలు మరియు వివక్షను తొలగించేందుకు కృషి చేయాలని తెలిపారు.

# నంద్యాలలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై రెండు నెలల విస్తృత అవగాహన ప్రచార కార్యక్రమం ప్రారంభం.

**☛పోస్టర్లు, బుక్‌లెట్ ను ఆవిష్కరించిన రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో, నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమం - 2026-27 కు సంబంధించిన పోస్టర్లను మరియు ప్రత్యేక బుక్‌లెట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్‌ను ప్రజారోగ్యానికి సవాలుగా లేకుండా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. సమాజంలో హెచ్.ఐ.వి పై ఉన్న అపోహలను తొలగించి, అవగాహన పెంపొందించడం, సకాలంలో పరీక్షలు మరియు ఉచిత వైద్య సేవలు అందించడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు .

రెండు నెలల ప్రచార ఉద్యమం:

నాకో (ఎన్ఏసిఓ) మరియు అప్సాక్స్ (ఏపీఎస్ఏసిఎస్) మార్గదర్శకాల ప్రకారం, ఆగస్టు 12 నుండి అక్టోబర్ 12 వరకు (రెండు నెలల పాటు) జిల్లా వ్యాప్తంగా ఈ విస్తృత ప్రచార కార్యక్రమం (ఐఐసీ- 3వ విడత) నిర్వహించబడుతుందని. భారతదేశంలో సుమారు 25.44 లక్షల మంది, ఏపీలో సుమారు 3,18,956 మంది హెచ్.ఐ.వి బాధిత వ్యక్తులు (పిఎల్.హెచ్ఐవి) ఉన్నారని . ఏపీలో ఇప్పటికే






2.79 లక్షల మందికి పైగా వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స అందుతోందని . మిగిలిన వారిని కూడా ముందస్తుగా గుర్తించి ఆర్టీ (ఏఆర్.టి) సెంటర్ల ద్వారా ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం అన్నారు. హెచ్.ఐ.వి సోకిన వారిని 95% నిర్ధారించడం, అందులో 95% మందికి చికిత్స అందించడం, 95% మందిలో వైరస్‌ను అదుపులోకి తీసుకురావడం ఈ ప్రచార ముఖ్య లక్ష్యం అన్నారు

ప్రచారంలో ప్రాధాన్యత అంశాలు:

హెచ్.ఐ.వి వ్యాప్తి మార్గాలు, నివారణ ఉపాయాలు మరియు లైంగిక సంబంధ వ్యాధుల (ఎస్.టి.ఐ.ఎస్) పై అవగాహన. గర్భిణీ స్త్రీలలో ముందస్తు పరీక్షలు నిర్వహించి, తల్లి నుండి శిశువుకు వ్యాధి సంక్రమించకుండా నిరోధించడం. హెచ్.ఐ.వి బారిన పడిన వారిపై సమాజంలో అపహాస్యం, వివక్షను రూపుమాపడం. ఉచిత సహాయం మరియు సమాచారం కోసం జాతీయ టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1097 వినియోగాన్ని ప్రోత్సహించడం. రెండు నెలల (8 వారాలు) పాటు వారానికి ఒక ప్రత్యేక అంశంపై సమగ్ర అవగాహన సదస్సులు, అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించడం.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఆర్. వెంకటరమణ, జిల్లా హెచ్ఐవి, టీబీ అధికారి డాక్టర్ శారదా బాయ్, మెడికల్ ఆఫీసర్ తేజస్విని, డాక్టర్ నిఖిల్ తేజ, రాజ్యలక్ష్మి, కౌన్సిలర్సు మరియు ఎయిడ్స్ కంట్రోల్ విభాగాధికారులు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మాటల్లో కాదు చేతల్లో సంక్షేమం చూపడమే ప్రభుత్వం లక్ష్యం

**వ్యవసాయ మార్కెట్ యార్డులో రాయితీ బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 11 పల్లె వెలుగు ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న ధరల నుంచి పేద మధ్యతరగతి కుటుంబాల సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ఏపీ కూటమి ప్రభుత్వం చేపట్టిన రాయితీ బియ్యం విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించారు.మంగళవారం నాడు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మార్కెట్లో బియ్యం ధరలు బగ్గుమంటున్న తరుణంలో పేదవాడి కడుపు నింపే లక్ష్యంతో కూటం ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు .చేతుల్లో సంక్షేమం చూపడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1 తేదీ నుండి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు మార్కెట్లో ధరలు పెరుగుతున్న సమయంలో సామాన్య





ప్రజలు కొంత ఉపశమనం కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు స్టీమ్ బియ్యం కిలో 52 రూపాయలు రా బియ్యం కిలో 50 రూపాయలకే ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకురావడం మార్కెట్‌లో ధరలు పెరుగుతున్న సమయంలో సామాన్య ప్రజలకు కొంత ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లలో బియ్యం కౌంటర్లు, అలాగే 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నేరుగా అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు.

మన ప్రభుత్వం ముఖ్యంగా మాటల్లో కాదు.. చేతల్లో సంక్షేమం అనే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని. రైతులకు మేలు చేయడంతో పాటు, వినియోగదారులపై ధరల భారం తగ్గించడం కూడా ప్రభుత్వ ప్రధాన లక్షమన్నారు

పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, సామాన్య ప్రజలపై భారం తగ్గించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం మనీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు

ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కుటుంబానికి 50 కిలోలు చొప్పున ఇందుకు సంబంధించి ఆధార్ కార్డు రేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జ్యోతి రత్న కుమారి, సివిల్ సప్లై అధికారి ప్రసాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ సురేష్ , ఆగ్రో ప్రవీణ్, రైస్ మిల్లు ఓనర్లు దేవిశెట్టి చంద్రుడు మాలపాటి రాంగోపాల్, సుబ్రహ్మణ్యం, డీలర్లు తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత నంద్యాల జిల్లా నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించండి

**మత్తు పదార్థాలకు యువత దూరంగఉండాలి,ఎస్సై శ్రీకాంత్**

**చాకరాజువేములలో "పల్లెబాటలో -- ఈగల్" అవగాహన కార్యక్రమం.**




దొర్నిపాడు ఆగస్టు 11 పల్లె వెలుగు న్యూస్ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి పోలీసులకు సహకరించి నంద్యాల జిల్లాను డ్రస్సు రహిత జిల్లాగా చేయాలనిఎస్ఐ శ్రీకాంత్ అన్నారు, ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూనంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆళ్లగడ్డ రూరల్ పర్యవేక్షణలో దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామంలో మంగళవారం నంద్యాల ఈగల్ సిబ్బందితో కలిసి ప్రజలకు డ్రగ్స్ రహిత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగకార్యక్రమంనిర్వహించారు,మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు కుటుంబ సంబంధాలు దెబ్బతినడం, ఆర్థిక సమస్యలు ఏర్పడటం, చదువు ఉద్యోగ భవిష్యత్తు నాశనం కావడం వంటి తీ ( వ ప ˇ రి ణ ా వ ా ల ు ఎదురవుతాయనివివరించారు.మత్తు పదార్థాల ప్రభావంతో నేరాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, తద్వారా నేరచరిత్ర ఏర్పడి భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.గంజాయిఇతర మత్తుపదార్థాలకు సంబంధించిన నేరాలపై అమలులో ఉన్న చీణూూ చట్టం గురించి ప్రజలకు వివరించారు.గ్రామంలో లేదా పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దొర్నిపాడు పోలీస్ సిబ్బంది నందన సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు

# వరి పంటకు బీమా తప్పనిసరి:ఏవో

మహానంది, పల్లె వెలుగు వరి పంటకు పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది




మండలంలోని గాజులపల్లె బసాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ...ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు పంట బీమా చేయించుకోవడానికి చివరి తేదీ ఆగస్టు 15 అని తెలిపారు. వెంటనే బీమా చేయించుకోవాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, సాగునీటి లభ్యతలో అనిశ్చితి కారణంగా పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నందున, పంట బీమా రైతులకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవచ్చని రైతులకు వివరించారు.వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు పంట బీమాపై విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి వరి రైతు పంట బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, రైతులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై మహిళలకు అవగాహన



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 11: జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి కోడూరు గ్రామంలో సీజన్లో వచ్చే వ్యాధులపై మంగళవారం మలేరియా ఆరోగ్య కార్యకర్త చక్రవర్తి మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలందరినీ సమైక్యపరిచి ఒక సమావేశాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు కాబట్టి, ఇళ్ళ ముందర నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. నీరు నిల్వ ఉన్న కారణంగా దోమలు పుట్టుకొచ్చి ప్రజలను వ్యాధుల బారిన పడేస్తాయని అన్నారు. వర్షాకాలంలో దోమకాటు కారణంగా ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని మహిళలకు సూచించారు. ఇళ్ళ ముందర ఉన్న గచ్చులను మూడు రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని అన్నారు. కొబ్బరి చిప్పలు, టైర్లు వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే, వ్యాధులు దరిచేరవని, మహిళలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మారని కళాశాల మైదానం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 11 : బండి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ని మైదానం వైఖరి లో ఏ మాత్రం మార్పు కనబడటం లేదు. కళాశాల మైదానంలో కంపచెట్లు విపరీతంగా పెరిగిపోయి అటవీ ప్రాంతాన్ని తలపిస్తూ ఉంది . కళాశాల మైదానం చెత్తాచెదారానికి నిలయంగా మారింది. కళాశాల మైదానం వైఖరి గురించి గతంలో పలుమార్లు పల్లె వెలుగు వెలుగు లోకి తేవడం జరిగింది. ఈ విషయంలో జిల్లా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం విచారించదగ్గ విషయం. కళాశాల లో డెస్కుల విషయంలో కూడా వివాదం చెలరేగింది. ఈ విషయంపై జిల్లా డిఐఇ ఓ జూలై ఒకటిన కళాశాలను సందర్శించారు. అదేదో ప్రిన్సిపాల్ సిబ్బంది మధ్య వివాదం ఉన్నట్లుగా తేల్చి సర్దుకుపోవాలని సూచించారు. కళాశాల మైదానం విషయంలో దృష్టి పెట్టాలని కూడా ప్రిన్సిపాల్ కు జిల్లా అధికారి సూచించడం జరిగింది. జిల్లా అధికారి చెప్పినప్పటికీ కళాశాల జంగిల్ క్లియరెన్స్ విషయంలో మాత్రం కళాశాల ప్రిన్సిపల్ శ్రద్ధ వహించడం లేదు. క్రీడామైదానం లేక విద్యార్థిని విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ కోసం గ్రామంలోని నాయకుల వద్దకు వెళ్లి ప్రిన్సిపల్ ప్రాధేయ పడుతూ ఉండడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఈసీ కీలక ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక వివరాలను వెల్లడించింది. ఇప్పటివరకు 78.30 శాతం ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.64 కోట్లకుపైగా ఫారాలను డిజిటైజ్ చేసినట్లు పేర్కొంది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది. వీరిలో 45.18 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు, 11.25 లక్షల మంది గైర్హాజరైనట్లు గుర్తించినట్లు తెలిపింది. అలాగే 9.22 లక్షల మంది మరణించినవారిగా గుర్తించారు. మరోవైపు 73.39 లక్షల ఫారాలను సేకరించలేని వాటిగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది.

# యువత రాజకీయాల్లోకి రావాలి



పల్లె వెలుగు:యువత' జాతీయ శక్తి యువత శక్తి' దేశ సంపద అభివృద్ధి చెందిన భారత్ ఆవిర్భావానికి 'వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే' బలమైన ప్రజాస్వామ్యం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని భారత ప్రధాన మంత్రి మోడీ పిలుపునివ్వడం జాతీయ స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ స్థాయిలో చర్చ జరగడం
గమనార్హం.యువత ప్రజా జీవితంలోకి చట్టసభల్లోకి ప్రజాప్రతి నిధులుగా రావాలని మోడీ మరోసారి పిలుపునిచ్చారు.ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని స్వాతంత్రదినోత్సవం సందర్భంగా మోడీ ఇచ్చిన పిలుపుకు జాతీయస్థాయిలో యువత నుండి మంచి స్పందన వస్తుంది.స్వాతంత్ర్యస్పూర్తితో యువత ముందుకు రావాలిలిరాజకీయ నేపథ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. దేశం కోసం వారు తమను పూర్తిగా అంకితం చేసుకున్నారు. మరోసారి స్వాతంత్ర ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశం కోసం సమర్పణ భావాన్ని మరో సారి పునర్జీవింప చేయవలసిన అవసరం ఉందని అన్నారు. యువత రాజకీయాలులిరాజకీయాల్లో యువత అనుభవం' ఉత్సాహం దేశానికి ఉపయోగపడేలా ఉండాలని.రాజకీయాల్లో రాణించాలని 'రాజకీయ నేపథ్యం లేని యువత రాజకీయాల్లోకి రావాలని ఎలాంటి రాజకీయ నేపథ్యంలోని లక్ష మంది యువత రాజకీయాల్లోకి స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు.కుటుంబ రాజకీయాలు అవినీతి రాజకీయాలు అంతం కావాలిలి. యువత తమ ప్రతిభను అనుభవాన్ని రాజకీయాల మార్పు కోసం ఉపయోగించుకోవాలని ప్రస్తుతం దేశంలో నెలకొన్న కుటుంబ రాజకీయాలు అవినీతి రాజకీయాలు దేశాన్ని పీడిస్తున్నాయి.నూతన ప్రతిభను యువతను రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకుంటాన్నాయని అవినీతి రహిత సమర్థవంతమైన పటిష్ట ప్రజాస్వామ్యవ్యవస్థ బలోపేతం కొసం ' పారదర్శక పాలన 'జవాబుదారీతనం' లక్ష్య సాధన 'అంకితభావంతో పనిచేసే ఎలాంటి రాజకీయ నేపథ్యంలోని యువత రాజకీయాల్లోకి రావాలని భారత ప్రధానమంత్రి మోడీ పిలుపునివ్వడం నవ శకానికి నాందిగా పేర్కొవచ్చు.యువత ప్రగతి సంధానకర్తలులిభారత దేశ జనాభాలో15బి 29 యేళ్ల.యువత 27.5శాతం వున్నారు .యువత జాతి ప్రగతికి సంధాన కర్తలు' అభివృధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది .మన దేశంలో యువతశాతంపెరుగుతుంది.భారత్ యువ దేశంలిమన దేశశీ 2020 నాటికి ప్రపంచములో అత్యంత 'యువ దేశంగా" నిలిచింది. దేశ జనాభాలో 40 శాతం ఉన్న యువత అత్యంత మానవ వనరు అని చెప్పవచ్చు జాతి భవిష్యత్తు వారే కనుక యువత నిర్వహించాల్సిన పాత్ర మహత్త రమైంది.యువత సృజనాత్మకతలి
యువత సృజనాత్మకత ఉత్సాహం' శక్తి కలిసి దేశంలో అద్భుత ఫలితాలు ఇవ్వగలవు. దేశాన్ని అభివృధి పథంలో? నడిపేందుకు దోహదపడే భలమైన మానవ వనరులు యువత. దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపే సత్తా యువతకు వుంది. అణశక్తి' అంతరిక్ష' డిజిటల్' క్రీడా 'రంగాలలో యువత గణనీయమైన ప్రభావం శక్తిగా ఎదడం ముదావహం. లియువ జనాభా ఎక్కువ ప్రాతినిధ్యం తక్కువలిప్రపంచ వ్యాప్తంగా జనాభాలో యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ చట్టసభల్లో ( పార్లమెంట్ అసెంబ్లీలో) వారి ప్రాతినిధ్యం చాలా తక్కువ ఉంది. నేటికి రాజకీయాలు అనేవి అనుభవజ్ఞులైన వృద్ధులైన నాయకుల చేతుల్లోనే కేంద్రీకృతమైనాయి. యువకులు కేవలం ఎన్నికల ప్రచారానికి డిజిటల్ మీడియా మేనేజ్మెంట్ కు మాత్రమే ఎక్కువగ వాడుకుంటున్నారు. వారికి చట్టసభల్లో సీట్లు కేటాయించడంలో రాజకీయ పార్టీలు వెనుకాడుతున్నాయి.
రాజకీయ పార్టీలు యువతకు ప్రాధాన్యంలిదేశ' రాష్ట్ర' జిల్లా 'మండల స్థాయి రాజకీయాలలో వివిధ రాజకీయపార్టీలుయువకులకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అనుబంధ సంఘాలు యువతలివివిధ రాజకీయ పార్టీలు అనుబంధ సంఘాలు విద్యార్థి సంఘాలు :యువజన సంఘాలు మరికొన్ని సంఘాలలో యువకులు విద్యావంతులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ధర్నాలు' పాదయాత్రలు ప్రచారంలో యువత ప్రతి రాజకీయ పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమం ప్రతి ఎలక్షన్ ఎన్నికల సభలు ధర్నాలు పాధయాత్రల్లో సమావేశాలలో యువకులు విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయడంలో ముదుండి ప్రధానమైన పాత్ర పోషించడం జరుగుతుంది.యువత ఓటు బ్యాంక్లిజాతీయ రాజకీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలు యువతను విద్యావంతులను ఓటు బ్యాంకుగా ఓట్లను సమీకరించె కార్యకర్తలుగా ఎన్నికల ఏజెంట్స్ గా ఉపయోగించుకోవడం రాజకీయ పార్టీల సాంప్రదాయమైంది.నేదునూరి కనకయ్య 'అధ్యక్షులుతెలంగాణ ఎకనమిక్ ఫోరంరచయిత కాలమిస్ట్ సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక మాజీ కరస్పాండెంట్' జస్టిస్ కుమారయ్య లా కాలేజీ కరీంనగర్.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఇంటింటికీ ప్రచారం,,





నందవరం పల్లె వెలుగు ఆగస్టు 11 రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి సూచనలతో కూటమి మరియు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నందవరం మండలం లో మాచపురం గ్రామంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధే ధ్యేయంగా.. కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసేలా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల చంద్రశేఖర్ మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కాసిం వలి, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత పెంపొందించడమే లక్ష్యం.

**● నంద్యాలలో స్వాతంత్ర్య సమరయోధుల అరుదైన ఛాయాచిత్ర ప్రదర్శన. ● చరిత్రకారుడు నశిర్ అహమద్‌కు ఇది 60వ ఫోటో ఎగ్జిబిషన్.**







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నేటి యువతరానికి భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలియజేసి, వారిలో దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ , ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ -- ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో, ఎం బి టి ఫౌండేషన్ సౌజన్యంతో నంద్యాలలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల అరుదైన ఛాయాచిత్ర ప్రదర్శన మంగళవారం ఘనంగా ప్రారంభమైంది.
ప్రముఖ రచయిత, చరిత్రకారుడు, పరిశోధకుడు నశిర్ అహమద్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన సేకరించిన భారత స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన సుమారు 335 అరుదైన స్వాతంత్ర సమరయోధుల ఛాయాచిత్రాలను వారి సేవలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, యువతకు చేరవేయాలనే లక్ష్యంతో నశిర్ అహమద్‌కు నిర్వహిస్తున్న 60వ ఫోటో ఎగ్జిబిషన్ కావడం విశేషం.
ఈ సందర్భంగా నశిర్ అహమద్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాలు, బలిదానాలను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత, చారిత్రక అవగాహన పెంపొందించాలనే సంకల్పంతోనే ఈ బృహత్తర కృషిని చేపట్టాను. ప్రస్తుత పరిస్థితుల్లో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం కాలానుగుణ అవసరం" అని పేర్కొన్నారు.
ఈ ప్రదర్శనను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా, రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు దశరథ రామిరెడ్డి, ఇతర కళాశాల విద్యార్థులు మధ్యాహ్నం కల్లా సుమారు 2000 మంది సందర్శించారు. మరుగున పడ్డ స్వాతంత్రోద్యమ వీరుల ఛాయాచిత్రాలను ఆసక్తిగా తిలకించిన వారు నిర్వాహకుల కృషిని అభినందించారు. అనంతరం నశిర్ అహమద్ గారితో సంభాషించి, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను సేకరించి భావితరాలకు అందించేందుకు ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులు, యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత, చారిత్రక అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవ అధ్యక్షులు ఎస్. మహమ్మద్ అబులైస్, కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, ఆల్ మేవా ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషా, జకీఉల్లా జేఏసీ యూత్ లీడర్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన అన్సర్ బాషా, ఫారూక్, నౌమాన్, జమాఅతే ఇస్లామీ హింద్‌కు చెందిన అబ్దుల్ సమద్, ఎస్‌డీపీఐకి చెందిన ఏజాజ్ హుస్సేన్, ప్యారే రసూల్, బషీర్ అహ్మద్, అబ్దుల్లా, కరాటే మహబూబ్ బాషా, హమీద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.
విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు ఈ అరుదైన ప్రదర్శనను సందర్శించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# నీరు నిలువ ఉంటే రోగాలను కొనితెచ్చుకున్నట్లే!

**☛స్టేట్ కన్సల్టెంట్ కొండారెడ్డి**
**☛డిఎంఒ చంద్రశేఖర రావు**





మిడుతూరు పల్లె వెలుగు ఆగస్టు 11: ఇళ్ళ ముందర నీరు నిలువ ఉంటే రోగాలను తెచ్చుకున్నట్లేనని స్టేట్ కన్సల్టెంట్ ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి, నంద్యాల జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు అన్నారు. మంగళవారం నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు మండలంలోని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగులుటి గ్రామాన్ని అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల ముందర వర్షపు నీళ్ళు నిల్వ ఉంచుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెంది అవకాశము ఉంటుందని అన్నారు. స్వల్ప కాలంలోనే నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు పుట్టుకొచ్చి, ప్రజలపై దాడి చేసి వ్యాధుల బారిన పడేస్తాయని అన్నారు. ఈ విషయంపై ప్రజలు అప్రమతమై ఇళ్ల ముందర నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గచ్చులు, టైర్లు, కొబ్బరి చిప్పలలో కూడా నీరు నిల్వ ఉన్న కారణంగా దోమలు ప్రబ లే ప్రమాదం ఉందని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు ఎప్పటికప్పుడు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. గచ్చులను పరిశీలించి, ఆ ప్రాంతాలలో అబేట్ ద్రావణాన్ని చల్లించారు. మలేరియా సిబ్బంది గ్రామంలో దోమల మందు పిచికారి చేసే విధానాన్ని కొండారెడ్డి చంద్రశేఖర రావులు పరిశీలించారు. తర్వాత కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు పరిశీలించారు. రక్త పరీక్షల నమూనాలను అధికారులు ఇద్దరు స్వయంగా పరిశీలించారు. ప్రజలు వ్యాధుల బారిన పడినప్పుడు సిబ్బంది సత్వరమే స్పందించి వైద్య సేవలు అందించడంలో సహకరించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజు, సిహెచ్ఓ సురేష్,ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు ఉన్నారు.

# పిల్లల కడుపులతో చెలగాటం.. 'నీళ్ల చారు'పై ఎస్ఎఫ్ఐ సమరభేరి!

**☛విద్యార్థులకు 'నీళ్ల చారు'.. ఉడికి ఉడికిన అన్నం!**
**☛మధ్యాహ్న భోజన ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలి.. ఎస్ఎఫ్ఐ ధర్నా**







హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 11 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించకుండా నీళ్ల చారు, ఉడికి ఉడికిన అన్నం అందిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు.
ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అయితే హొళగుందలో మధ్యాహ్న భోజనం పేరుతో నీళ్ల చారు, ఉడికి ఉడికిన అన్నం అందిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా నాణ్యతలేని భోజనం అందిస్తే సహించేది లేదన్నారు.
"విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్న ప్రస్తుత వంట ఏజెన్సీ మాకు వద్దు. వెంటనే ఆ ఏజెన్సీని రద్దు చేసి, నాణ్యమైన భోజనం అందించే ఏజెన్సీని ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు.
మధ్యాహ్న భోజనాన్ని నిర్ణీత సమయానికి వండి, వేడిగా, నాణ్యతతో విద్యార్థులకు అందించాలని కోరారు. అధికారులు పాఠశాలలు, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.
సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులను ఐక్యం చేసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, వచ్చిరప్ప, నాయకులు మహేష్, రాజు, గౌస్, విజయ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతా-శిశు సంరక్షణే ధ్యేయం:

## కర్నూలు జిల్లాకు 27 'తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాల కేటాయింపు

- కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్
- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన మంత్రి భరత్, కలెక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత
- ఏసీ సదుపాయంతో పాటు ఆధునిక భద్రతా ప్రమాణాలతో నూతన వాహనాలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో







గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అత్యవసర వేళల్లో నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం '102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత బలోపేతం చేసిందని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ వెల్లడించారు. మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా కేటాయించిన 27 'తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిలతో కలిసి మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

**అత్యాధునిక సదుపాయాలతో వాహనాలు:**

ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలను ప్రారంభించగా, అందులో కర్నూలు జిల్లాకు 27 వాహనాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కొత్త వాహనాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ వసతితో పాటు అత్యవసర పరికరాలు, భద్రతా ప్రమాణాలను పెంచామని పేర్కొన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భిణులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడంలో, ప్రసవానంతరం సురక్షితంగా ఇళ్లకు పంపడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కర్నూలు జీజీహెచ్ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులతో పాటు పాత నగరంలోని 'గడియారం ఆసుపత్రి'ని పునరుద్ధరించేందుకు చర్యలు వేగవంతం చేశామని తెలిపారు.

**మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ.. జిల్లాకు త్వరలోనే మరో 17 వాహనాలు రానున్నాయని తెలిపారు. రక్తహీనత, అధిక బీపీ వంటి సమస్యలతో బాధపడే 'హైరిస్క్' గర్భిణులకు ఉచిత పికప్, డ్రాప్ సౌకర్యాలు ఎంతో మేలు చేస్తాయని, జిల్లాలో మాతా-శిశు మరణాల రేటును మరిన్ని కనిష్ట స్థాయికి తగ్గించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**వైద్య రంగానికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి**

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. 2017లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టిన ఈ పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరింత ఆధునీకరించి ప్రజలకు చెంతకు తెచ్చిందని కొనియాడారు. ప్రజలందరూ ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (ఇవీడనూ) డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా జనసేన అధ్యక్షులు సురేష్, ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే

## కూటమి ప్రభుత్వ ధ్యేయం: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి

- ప్యాపిలి మండలంలో వైభవంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'
- మామిళ్లపల్లె, రాంపురం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను ఇంటింటికీ వివరించిన ఎమ్మెల్యే కోట్ల





పల్లె వెలుగు - ప్యాపిలి ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజానుకూల పాలన అందిస్తుందని డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి -- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ లతో కలిసి 16వ రోజు ప్యాపిలి మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు.

?మండల పరిధిలోని మామిళ్లపల్లె, రాంపురం, రాచవాండ్లపల్లె, జక్కశానికుంట్ల, నల్లమేకలపల్లె గ్రామాలలో ఎమ్మెల్యే కోట్ల ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను పలకరించారు. ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి వారి పక్షాన ఉంటూ వారి సమస్యలను, క్షేత్రస్థాయి ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని వృద్ధులు, మహిళలు, రైతులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

?అభివృద్ధి - సంక్షేమమే మా ప్రాధాన్యత:

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.

?గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రోడ్ల నిర్మాణం మరియు సాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతా క్రమంలో తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, సీమ సుధాకర్ రెడ్డి, సుదర్శన్,కాజాపీర్, నేరేడుచర్ల వెంకటేష్,ఆర్ఇ నాగరాజు, బట్ట సత్యం, రవి,రాజశేఖర్,భాస్కర్ నాయుడు,బాల నరసింహులు, నాగేశ్వరరావు,ప్రసాద్, రాంపురం నాగేశ్వరరావు, మామిళ్లపల్లె శ్రీనివాసులు,మోహన్, గోపాల్ రెడ్డి,శ్రీనివాసరెడ్డి, జయరాముడు, మహేష్, దేవేంద్ర,ఆదిరెడ్డి, దామోదర్ నాయుడు,కెసీ మద్దిలేటి పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై మొబైల్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమం..



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా బిలకల గూడూరు గ్రామం సమీపంలో ఉన్న జెఎస్డబ్ల్యు సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్వహించిన కార్యక్రమం ముఖ్య అతిధులుగా అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ శారదాబాయి, మరియు డిస్ట్రిక్ట్ స్టేటస్ ఫర్ హెచ్ఐవి ఎయిడ్స్ టీం సభ్యులు దిశా వీరి ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై వీరు మాట్లాడుతూవ్యాధి వ్యాప్తి మరియు నివారణహెచ్ఐవి ( హెచ్ఐవి )సోకిన వ్యక్తితో అసురక్షిత లైంగిక సంబంధాల ద్వారా ఇది వ్యాపిస్తుంది.సురక్షితం కాని రక్తం మార్పిడి చేయడం మరియు పరిశుభ్రత లేని సిరంజీలు వాడడం వల్ల ప్రమాదం ఉంది.గర్భిణీ స్త్రీల నుండి కడుపులోని బిడ్డకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.పరీక్షలు మరియు కౌన్సెలింగ్రప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు మరియు కౌన్సెలింగ్




లభిస్తాయి.ఎయిడ్స్ నివారణ సమాచారం కోసం జాతీయ టోల్ ఫ్రీ నెంబర్ 1097 ని సంప్రదించవచ్చు.వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే ఏఆర్టీ (ఏ ఆర్ టి) మందుల ద్వారా జీవిత కాలాన్ని పెరుగుపరచవచ్చు.సామాజిక స్పృహఎయిడ్స్ సోకిన వారి పట్ల సమాజంలో ఎలాంటి వివక్ష చూపకూడదు.బాధితులకు మానసిక స్థైర్యం, సరైన పోషకాహారం మరియు కుటుంబ మద్దతు అందించాలనీ తెలిపారు ఈ , ఇందులోమొబైల్ ఐసిటిసి వాహనం ద్వారా హెచ్ఐవి సిఫలిస్ పరీక్షలు అవగాహన కార్యక్రమం జేయస్ డబ్ల్యు ఫ్యాక్టరీ లో నిర్వహించడం జరిగింది ,ఈ కార్యక్రమంలో మొబైల్ ఐ సి టి సి కౌన్సిలర్ నాగమల్లిక సభ్యులు కౌన్సిలర్ నాగమల్లిక, వి ఎం ఎం శాంతి అండ్ ఎల్ డబ్ల్యూ సూపర్వైజర్ మీరమ్ రెడ్డి, లింక్ వర్కర్ వెంకటసుబ్బయ్య , సి ఎస్ ఆర్ టీం సభ్యులు విజయలక్ష్మి పాల్గొన్నారు .

## రూ. 633.94 లక్షల మంచినీటి పథకం ప్రారంభం

జగ్గంపేట, ఆగస్టు 11 (పల్లె వెలుగు దినపత్రిక) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్ నిధులు రూ. 633.94 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు స్వయంగా బిందెలతో నీటిని పట్టి అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన శుద్ధి చేసిన తాగునీరు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పథకం ఉపయోగపడుతుందని చెప్పారు. ఇక్కడే 150000 లీటర్ల సామర్థ్యం గల మరో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ స్థానంలో త్వరలోనే కొత్త ట్యాంక్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. భావారం ఫిల్టర్ వాటర్ ద్వారా మంచినీటి చెరువు నీటిని ప్యూరిఫై చేసి ప్రతి అవసరానికి శుద్ధి చేసిన నీటిని అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీనుమణి బాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, పైడిపాల సూరిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, రాయి సాయి, వేములకొండ జోగారావు, పీల మహేష్, నండ్ల చిరంజీవి, ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ శివ, కాంట్రాక్టర్ శ్రీనివాస్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్ రాంజీ మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## గోవిందపురం - మల్లవరం బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన



జగ్గంపేట, ఆగస్టు 11 (ఆపల్లె వెలుగుదినపత్రిక) గోవిందపురం శివారు, గోకవరం మండలం మల్లవరం గ్రామాల మధ్య భూపతిపాలెం సమీపంలో కోటి 87 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణానికి జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ మంగళవారం శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామీణ సమృద్ధి యోజన ఫేజ్-3 నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గోవిందపురం, మల్లవరం గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. భూపతిపాలెం గురుకుల పాఠశాల సమీపంలో కంచి కామకోటి పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో కేజీ నుంచి పీజీ వరకు ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి సెప్టెంబర్ మొదటి వారంలో ప్రతినిధులు రానున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ సరిహద్దు ప్రాంతమైనందున తీవ్ర వరద ఉధృతిని తట్టుకునేలా అత్యంత మన్నికతో ఈ బ్రిడ్జి నిర్మాణం డిజైన్ చేసినట్లు వెల్లడించారు. నిధులు మంజూరు చేయించి ప్రాజెక్టును పట్టాలెక్కించడంలో ఎమ్మెల్యే చూపిన చొరవ అభినందనీయమని ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ) ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కన్నబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, దాసరి తమన్న దొర, పిల్లా చంటిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, రేఖ బుల్లి రాజు, పురంశెట్టి శివాజీ, యిడుదల అర్జునరావు, కమ్మిల వెంకటేశ్వరరావు, నాని రాజు, కొల్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు


## సూర్య మహిళా జూనియర్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



జగ్గంపేట, ఆగస్టు 11 (పల్లె వెలుగు దినపత్రిక) కాపు కళ్యాణ మండపంలో సూర్య మహిళా జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకలు కాలేజీ కరస్పాండెంట్ కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కార్యక్రమంలో భాగంగా గత విద్యా సంవత్సరంలో కాలేజీ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులను జ్యోతుల నవీన్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కాలేజీ యాజమాన్యం జ్యోతుల నవీన్‌ను సన్మానించింది. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని, కాలేజీ యాజమాన్యం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, రాయి సాయి, వెలిశెట్టి బుజ్జి, కాలేజ్ ప్రిన్సిపాల్ గంట శ్రీరామ్ ప్రసాద్, కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఆగస్టు 14న రాజమహేంద్రవరం మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా



రాజమహేంద్రవరం, ఆగస్టు 11 పల్లె వెలుగు దినపత్రిక) తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ (ఉపాధి కార్యాలయం) ప్రాంగణంలో ఆగస్టు 14వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ ఆపిల్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఠాగూర్ లాబ్స్ కంపెనీలలో పలు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, డిప్లొమా లేదా బీటెక్ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా వఎజూశ్రీశీఎవత్.ఖజూ.స్త్రశీజ.అఅ పోర్టల్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకుని, రెజ్యూమే, ఆధార్ కార్డు, సంబంధిత విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9398318601 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష పేర్కొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com